

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### వైరల్

**మా సందానీగాడికి** ఏ విషయమైనా చెపితే, చటుక్కున ఊరూ వాడా ప్రచారం చేసేసేవాడు. అప్పట్లో ఈ వైరల్ అన్నమాట అస్సలు తెలీదు కానీ వాడంత వైరల్ సన్నాసి ఇంకోడుండేవాడు కాడు.

కొత్తగా మనం వింటున్న మాట జెన్‌జీ! మా ఇంట్లో పిల్లలూ, మనవలూ "జెన్‌జీ ప్రకారం ఇది అంతే, వాళ్ళు ఏం రూల్స్ పాటించరు" అనడం వింటున్నాను.

మా అమ్మకి ఉద్యోగం వచ్చిన కొత్తల్లో మా అమ్మమ్మగారి తల్లిగారు "ఏవే మీరూ మగాళ్ళతో సమానంగా కుర్చీల మీద కూర్చుని పని చేస్తారా? అని అమాయకంగా అడిగిందిట. ఏవిటో ఈ నవీన కాలం అని బుగ్గన వేలేసుకుని ఆశ్చర్యపోయికూడా ఉంటారు.

"రంగనాధం మాస్టారుకి నాలుగు వాంతులూ, రెండు విరేచనాలూ అయ్యాయి, ఆచారిగారు పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్ళమన్నారు" అని వాళ్ళమ్మ ఎదురింటావిడతో చెప్పడం విని సందానీగాడు "చిట్టి వాళ్ళ తాత ఇట్లాగే ఫీవర్ ఆవ్పత్రికి వెళ్ళి, పోయాడు. ఇంక రాలేదు" అని కూడా అనడం విని, "రంగనాధం మాస్టారు ఫీవర్ ఆస్పటల్‌కి పోయి, పోయారు. బడికి శెలవు అని వైరల్ చేసాడు.

అది ఎంత వైరల్ అయిందంటే హెడ్ మాస్టర్ అర్జెంటుగా శలవు నోటీసు పంపించారు. రంగనాధం మాస్టారు తమ్ముడి కూతురి పెళ్ళి చూపులు రద్దు చేయించాడు తమ్ముడు మైల అని. క్రీస్తుమణి టీచర్, తిమోతీసార్, నీలకంఠ శాస్త్రీ, సంతాప సభ పెడ్తుండగా, రంగనాధం మాస్టారు లీవ్ అప్లికేషన్ పట్టుకుని బడిలోకి ఎంటరయ్యారు. ఎదురుగా కుంకుమ బొట్టుతో, మెడలో మాలతో ఆయన ఫోటో..మన టీవీ సీరియల్స్‌లోలాగా వైరల్ అవడం అంటే అదే. సోషల్ మీడియాలేకపోయినా, మా సందానీగాడి చెవిన ఏ వార్త అయినా పడితే, పిల్లా మేకా, అందరికీ ఆ వార్త దావానలంలా

వ్యాపింప చేసేవాడు. వాడి వీపు విమానం మోత మోగించేవారే కానీ ఉత్తమ డిజిటల్ క్రియేటర్ అనో, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ అనో సత్కారాలు చెయ్యలేదు.

సందానీ తల్లి బీబీ బీడీలు చేస్తూ, బరోడా బ్యాంక్ మేనేజర్ పెళ్ళానికి పనులు చేసే మనిషి "మూడు నెలలుగా జీతం ఇవ్వలేదు, అయ్యగారికే తనఖా పడలేదుట..అంది" అనగానే, అది ఆ నోటా ఈ నోటా పడి బరోడా బ్యాంక్ దివాలా తీస్తోంది, ఏ నిమిషానైనా మూసేస్తారేమో అని బ్యాంక్ ముందు ఖాతాదరులు క్యూ కట్టారంటే కూడా అందులో సందానీగాడి ప్రతిభ అపారం. అటువంటివాడు ఈ రోజుల్లో వుండివుంటే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా ఎంత గొప్ప పేరూ కీర్తీ సంపాదించుకునేవాడో కదా!

ఇంక ఇప్పటి జెనరేషన్ విషయానికొస్తే నిన్న సాయంత్రం ఒక తెలుగు గేమ్ షోలో ఒక అమ్మాయి, ఆరుగంటలు అయితే చాలు.. నాలోంచి ఒక చంద్రముఖి బయటకొస్తుంది. "మావా...ఒక పెగ్ లే" అంటూ, గ్లాసు కింద పెట్టను అని చెప్తోంది. ఆ తండ్రి మురిసిపోతూ "మా అమ్మాయి నాకు గర్వకారణం" అని చెప్పాడు.

అమ్మ ఆఫీసులో పని చేస్తున్నప్పుడు, మొదట్లో తన కొలీగ్ రాజమణి జడకి కుచ్చులూ, నాగరం, కాళ్ళకి ఘల్లు ఘల్లుమని మోగే పాంజేబులూ, తలలో వీశ పువ్వులతో వచ్చేదనీ, తనే అలా రాకూడదని చెప్పి మానిపించాననీ, లేకపోతే ఒకరోజు బటన్ చేమంతులు కుప్పగా పెట్టుకుని వస్తూవుంటే, వెనక మేకల గుంపు పడిందనీ చెప్పేది. మా అమ్మ కూడా అంతో ఇంతో సోషల్ ఇన్‌ఫ్లూయెన్సరే అప్పట్లో.

ఫేస్‌బుక్ లేని రోజుల్లో, వాల్ మీద పిడకలు చరుచుకుంటూ మా కాలనీలో ఒకటో నెంబర్ ఇంటావిడా, ఎదురింటావిడా ఎవరి మొగుడు ఎవరితో తిరుగుతున్నాడూ, ఆఫీస్‌లో పనిచేసే ఆడవాళ్ళు ఎంతంత జాణ పనులు చేస్తున్నారూ.. ఏ అత్త కోడలికి మందు పెట్టించింది? ఎవరింట్లో ఎవరి అమ్మాయికి అబార్షన్ చేయించారు.. ఇలా టివీ ఇంకా ఇంకా కొంపలార్పేవీ, పిడకలతో పాటు గోడలకి చరిచి గొడవలు లేవదీసేవారు. ఇప్పుడు అదే పని చాలామంది ఫేస్‌బుక్ వాల్స్ మీద చేస్తుంటారు.

"ఆ అమ్మాయి మగాడితో సమానంగా లాగూ చొక్కాలేసుకుని, లూనా మీద కాలేజీకి వెళ్తుంది మగరాయుడిలా" అని 80లలో మా కజిన్ సిస్టర్ గురించి కాలనీలో ఆడాళ్ళంతా గుసగుసలాడడం నాకు తెలుసు.

సందానీగాడితో ఏమాట అనాలన్నా నాకు భయంగానే వుండేది. "చిట్టీ వాళ్ళ పిన్నికి పిల్లలు లేక ఒక అమ్మాయిని పెంచుకున్నారట మా అమ్మమ్మ అనసూయా వాళ్ళమ్మతో చెప్తుంటే విన్నాను అని ఓసారి చెప్పానో లేదో...వీడు చిట్టీ వాళ్ళ పిన్నిని తీసేసి "చిట్టీని వాళ్ళ అమ్మా నాన్నా పెంచుకున్నారట. సొంత కూతురు కాదు" అని చాటడందాకా వెళ్ళి చిట్టి సంచిలో రెండు గౌన్లు పెట్టుకుని "మా అమ్మా నాన్నా దగ్గరకి నేను పోతా" అని గౌలీగూడా బస్ డిపోకి పోయి కూర్చుందిట. కాలనీ అంతా చిట్టి కోసం వెతుకుతుంటే, నాకే అనుమానం వచ్చి "సందానీగాడ్ని అడిగి చూడండి" అన్నా.

సందానీగాడి అబ్బాజాన్ బెల్ట్ తీసి "ఏరా! నువ్వేమైనా చెప్పావా?" అంటే చిట్టితో ఇలా చెప్పాననీ, బస్ డిపోకి వెళ్ళిందనీ చెప్పాడు.

లక్కీగా తీసుకెళ్ళిన డబ్బులతో చిట్టి పాలఐస్, మిరపకాయ బజ్జీలూ కొనుక్కుని తినేసి, ఏ బస్ ఎక్కి ఏ అమ్మా నాన్నల దగ్గరికి వెళ్ళాలో తెలీక ఏడుస్తూ కూర్చోవడం వల్ల, వాళ్ళ ఇంట్లో వాళ్ళకి దొరికింది.పోనీ దానికి సందానీగాడు చెప్పిన జీవిత సత్యంలో నిజం వుందా అంటే అదీ లేదు. ఆ తర్వాత ఆ పిల్ల ఎన్నడూ అమ్మా నాన్నల మాట ఏ విషయంలోనూ వినలేదు.

డాబా కట్టుకున్న మూర్తిగారిని అందరూ డాబా మూర్తిగారు అంటే, సందానీగాడు మాత్రం "డబ్బా మూర్తి" అనేవాడు. ఆయన డాబా మీద చీరలు ఆరేస్తున్న పనిమనిషిని, తన పెళ్ళాం అనుకుని వెనుక నుండి వెళ్ళి పట్టుకున్నాడుట. అందులో ఆయన తప్పేం లేదు.ఆ చీర వాళ్ళావిడదే. ముందు రోజే ఆమెకిచ్చిందిట.ఈయన చీర చూసి స్వంత పెళ్ళాం అనుకుని పనిమనిషిని వెనకనుండి వాటేసుకున్నాడుట. అక్కడ ప్రత్యక్ష సాక్షులెవరూ లేరు. గోడమీద వాలిన "జెముడు కాకి తప్ప" అని ఆయన అనుకుని పనిమనిషి కాళ్ళు పట్టుకుని, పెళ్ళాంకి చెప్పొద్దని, జేబులో వున్న వంద రూపాయల నోటు ఇచ్చాడుట.

పనిమనిషి మధ్యాహ్నమే అందరిళ్ళల్లో పని మానేసి శోభన్‌బాబు సినిమాకి మాట్నీకి చెక్కేసింది. సందానీ చిన్నమ్మ అదే సినిమాకి వెళ్ళింది. ఆ పనిమనిషి హైక్లాస్ టికెట్ కొనుక్కుని, ఈవిడకి కూడా కూల్ డ్రింక్ ఆఫర్ చెయ్యడంతో "ఇంత డబ్బు నెలాఖరిలో ఎలా వచ్చింది?" అని కూపీ లాగితే, డబ్బా మూర్తిగారు ఇచ్చారు అందిట.

"జీతమా?" అని అడిగితే "కాదు వాటేసుకున్నందుకు" అందిట.. అంతే! ఇది కార్చిచ్చులా వ్యాపించి, డబ్బా మూర్తిగారి పెళ్ళాం తన రెండున్నర సంతానంతో, అంటే ఎడపిల్లలు ఇద్దరూ, కడుపులోవున్న నాలుగు నెలలపిండంతో, ముక్కులు ఎగబీలుస్తూ, శాపనార్థాలు పెడ్తూ, సూట్‌కేసు లేక హోల్డాలూ, ట్రంకు పెట్టెతో రిక్షా ఎక్కి పుట్టింటికి వెళ్ళిపోవడంలో కూడా సందానీ చిన్నమ్మతోబాటు సందానీ పాత్ర కూడా ఎంతో వుంది అని నా అనుమానం.

ఈ రకంగా ఏ పుకారైనా రెక్కలొచ్చి వైల్డ్ ఫైర్‌లా వ్యాపించేది మా చిన్నప్పుడు. ఉత్తరాలూ, టెలిగ్రాములూ లేట్‌గా వచ్చేవేమో కానీ, గాలి వార్తలు మాత్రం ఆఘమేఘాల మీద వ్యాపించేవి. అంటే ప్రచార సాధనాలు అంత ఎఫీషియెంట్‌గా ఉండేవి.

మా పి టీ సార్ జగన్నాథరావుకి ఏ పెళ్ళి సంబంధం కుదిరేదికాదు. పెళ్ళివారు "ముందు షర్ట్ విప్పి చూపించండి" అంటుంటే, అతను చిన్నబోయి, తెల్లబోయి, ఆ తర్వాత "ఎందుకని" ఆరా తీస్తే అతగాడికి వీపు మీద తామర వుందని పుకారొచ్చిందని తెలిసింది. ఎండలో నీల్ డౌన్ చేయిస్తాడని, తన అధికారం చూపించి, సందానీగాడే ఆపుకారు వ్యాపింపచేసాడు.

ఆ రోజుల్లో పెళ్ళి చూపులంటే, పిల్లాడి మీద సి.ఐడీలని పెట్టించినంత పనిచేసి ఏమైనా వ్యసనాలున్నాయా? రోగాలున్నాయా అని చూసేవారు. ఈ రోజుల్లో ఆడపిల్లలు చూపుడు వేలు చూపించి మరీ "డోంట్ జడ్జ్‌మీ.. నేను సిగరెట్

తాగుతా, మందు తాగుతా, మొన్నటిదాకా ఒక అబ్బాయితో రిలేషన్‌లో వున్నా.. దానివల్ల నా కేరెక్టర్‌ని జడ్జ్ చేస్తావా?" అని అడుగుతున్నారు.

కొత్త కోడలు రాగానే ఆ రోజుల్లో మేండేటరీగా, ఇంట్లో అత్తా మామా, ఆడబిడ్డలూ, మొగుడూ, బావగార్లూ అంతా కలిసి రాగింగ్ టైప్‌లో ఆమెని ఏడిపించి, బండకేసి రాసినట్లు పనులు చెప్పి హింసించడం ఆనవాయితీగా వుండేది.

ఈ రోజుల్లో అత్తా మామా అందరూ చాలా భయం భయంగా "ఏం అంటే ఏం కేసులు పెడ్తుందో మన మీద" అన్నట్లు చూస్తున్నారు.

అసలు ఈ గోలలు అన్నీ ఎందుకు? కలిసి వుంటాం.. కొన్నాళ్ళకి నచ్చకపోతే విడిపోతాం. ఈ పెళ్ళిళ్ళూ పిల్లలూ అనవసరం. అని మేగ్జిమమ్ జెన్‌జీ వాళ్ళు డిసైడ్ అయ్యారు.

అటూ ఇటూ కాని జెనరేషన్ పెళ్ళిళ్ళు అనగానే ప్రీ వెడ్ షూట్స్, సంగీత్‌లూ, మెహందీలూ, ఆకాశం అంత పందిళ్ళూ, భూదేవంత పీటలూ అంటూ తల్లితండ్రుల్నీ, అత్తమామల్నీ ఆర్పేస్తున్నారు.

ఇవన్నీ ఇన్‌స్టాలో, ఫేస్‌బుక్‌లో, ట్విట్టర్‌లో వైరల్ చేసినంతసేపు పట్టడంలేదు. జంటలు మనోభావాలు కలవక విడిపోడానికి. ఇదేం కాలం అంటే.. మరదే.. మారే కాలం మాయదారి కాలం.

Post your comments







